అటకెక్కిన శ్మశాన వాటిక నిర్వహణ

• కంపు కొడుతున్న మూత్రశాలలు, స్నానపు గదులు • మరమ్మతులు లేక నిరుపయోగం • పట్టించుకోని అధికారులు

లక్షలాది రూపాయలతో అభివృద్ధి చేసిన శ్మశాన వాటిక నిర్వహణ కొరవడింది. మరమ్మతులు లేక మూత్రశాలలు, స్నానపు గదులు నిరుపయోగంగా మారుతున్నాయి. దీంతో కలుపు మొక్కలు పెరుగుతున్నాయి. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి విజయనగర్ కాలనీ, చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లకు ఆనుకుని 2022లో రూ.80 లక్షలతో ఎస్సీ శ్మశాన వాటికను అభివృద్ధి చేశారు. అంత్యక్రియలు నిర్వహించే వారు కూర్చునేందుకు ఓ గదితో పాటు పురుషులు, మహిళలకు వేర్వేరుగా స్నానపు గదులు, మూత్రశాలలు ఏర్పాటు చేశారు. మూడేళ్లుగా శ్మశాన వాటిక నిర్వహణను పట్టించుకోకపోవడంతో అపరిశుభ్రత నెలకొంది. డోర్‌లు సైతం ధ్వంసమయ్యాయి. లక్షలాది రూపాయాలు వెచ్చించి ఏర్పాటు చేసిన శ్మశాన వాటిక నిర్వహణపై ఇకనైనా అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

– రంగారెడ్డినగర్


నిరుపయోగంగా ఉన్న స్నానపు గదులు, మూత్రశాలలు


కలుపు మొక్కలతో అపరిశుభ్రంగా ఉన్న ఎస్సీ శ్మశాన వాటిక

ఏపుగా కలుపు మొక్కలు

ఎస్సీ శ్మశాన వాటికలో మృతదేహాన్ని పూడ్చి పెట్టే ప్రాంతంలో కలుపు మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో అంత్యక్రియలకు వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ విష సర్పాలు, పరుగులు ముడుతాయో అని భయాందోళన మధ్య అంత్యక్రియలు నిర్వహించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా చదును చేయించడం లేదు.

అపరిశుభ్రంగా స్నానపు గదులు

అంత్యక్రియలకు వచ్చే వారికి సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన స్నానపు గదుల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. మహిళలు, పురుషులకు వేర్వేరుగా ఏర్పాటు చేసిన మూత్ర శాలల్లో వాష్ బేషిన్‌లు మాయమయ్యాయి. ఇక మూత్ర విసర్జన చేసే ప్రాంతంలో నీటి పైపులు లేకపోవడంతో పాకురు పట్టి దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారు. వాష్ బేషిన్‌లకు ట్యాప్‌లు ఏర్పాటు చేయకుండానే కాంట్రాక్టర్ చేతులు దులుపుకోవడంతో నీళ్లు రాక నిరుపయోగంగా మారింది.


మాయమైన వాష్‌బేషిన్‌లు


మూత్రశాలల్లో అమర్చని ట్యాప్

చుట్టు పక్కల చెత్త డంపింగ్

శ్మశాన వాటిక అపరిశుభ్రంగా ఉండటంతో చుట్టు పక్కల ఇళ్ల వాసులు ఆవరణలోనే చెత్త వేస్తున్నారు. రోజుల తరబడి చెత్త పేరుకుపోవడంతో శ్మశాన వాటిక చెత్త డంపింగ్ పాయింట్‌గా మారిపోయింది. అదే విధంగా శ్మశాన వాటిక నుంచి బయటకు తీసిన ఓపెన్ నాలా సైతం చెత్త కుప్పలతో నిండిపోయింది.

త్వరలోనే పరిశీలించి మెరుగుపరుస్తాం

శ్మశాన వాటికలో అపరిశుభ్ర వాతావరణం, ఇతర సమస్యలను త్వరలోనే పరిశీలిస్తాం. కలుపు మొక్కలను సిబ్బందితో తొలగిస్తాం. బాత్‌రూములు, స్నానపు గదులను మరమ్మతులు చేయించి వసతులను మెరుగుపరుస్తాం.

– శిరీష, డీఈఈ

విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుభాష్‌నగర్: విద్యుత్ మరమ్మతు పనుల నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని గాజులరామారం సెక్షన్ ఏఈ చైతన్యభార్గవ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ కైలాష్‌హిల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు షిర్డీ హిల్స్, కైలాష్ హిల్స్ పార్కు లేన్, ప్రాగా టూల్స్, ఐశ్వర్య ఎస్టేట్స్, భారత్ పెట్రోల్ బంక్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

11కేవీ ప్రశాంత్‌నగర్ ఫీడర్ పరిధిలో..

నిజాంపేట్ : 11కేవీ ప్రశాంత్‌నగర్ ఫీడర్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని విద్యుత్ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మయూరి నగర్, టెంపుల్ కాంప్లెక్స్, ఎంఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్స్, ఆర్ఎల్ సిటీ రోడ్డు, వృద్ధాశ్రమం ఇందిరమ్మ కాలనీ ఫేజ్ 2లలో, మయూరి నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ మయూరి నగర్ ఫీడర్‌లో వృద్ధాశ్రమం, మయూరి నగర్, ఎస్‌బీఐ రోడ్డు, విజేత సూపర్ మార్కెట్ రోడ్డులో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, 11కేవీ రామ్ నరేష్ నగర్ ఓహెచ్ ఫీడర్‌లో ఏఎస్‌రాజు నగర్, మిత్రహిల్స్, ప్రశాంత్‌నగర్, 11కేవీ లెజెండ్ ఫీడర్‌లో జెండ్ అపార్ట్‌మెంట్స్, మయూరి నగర్‌లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదని తెలిపారు.

మైసమ్మనగర్ బీ బ్లాక్ బస్తీ అధ్యక్షుడిగా బసవప్ప


నూతనంగా ఎన్నికైన వారిని సత్కరిస్తున్న బస్తీ ప్రజలు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట డివిజన్ మైసమ్మనగర్ బీ బ్లాక్ బస్తీ కమిటీ అధ్యక్షుడిగా బసవప్ప గెలుపొందారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో స్కూటర్ గుర్తుపై పోటీ చేసిన ప్యానెల్ గెలుపొందింది. బస్తీలో మొత్తం 464 ఓట్లు ఉండగా అందులో 399 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధ్యక్షులుగా పోటీ చేసిన బసవప్ప 70 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా బండారి రవీందర్‌రెడ్డి 144 ఓట్ల మెజార్టీ, కోశాధికారిగా శ్రీకాంత్ యాదవ్ 65 ఓట్లతో గెలుపొందారు. అనంతరం బస్తీ పెద్దలు, ప్రజలు నూతనంగా గెలిచిన కమిటీ సభ్యులను సత్కరించారు.

ప్రభుత్వ స్థలం కబ్జాపై ఫిర్యాదు



నిజాంపేట్: బాచుపల్లి మండలం నిజాంపేట్‌లోని శివాలయం పక్కనే ఉన్న సర్వే నంబర్ 233/21లోని ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ మేయర్ కొలను నీలాగోపాల్‌రెడ్డి, బీజేపీ నిజాంపేట్ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ కోరారు. జిల్లా కలెక్టర్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఆదివారం సెలవు రోజు కావడంతో ప్రహరీ నిర్మాణం చేపట్టేందుకు పనులు ప్రారంభించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అడ్డుకోవడానికి వచ్చిన ఆర్ఐని సైతం లెక్కచేయలేదని తెలిపారు. 233/21లోని ప్రభుత్వ స్థలాన్ని ప్రజల అవసరాల కోసం వినియోగించాలని కోరారు.

సేఫ్టీ పరికరాలు లేకుండానే..


ఉషోదయ టవర్ చౌరస్తాలో సేఫ్టీ పరికరాలు లేకుండా పని చేస్తున్న విద్యుత్ సిబ్బంది

కుత్బుల్లాపూర్ : విద్యుత్ భద్రత వారోత్సవాల భాగంగా సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు ఆచరణలో మాత్రం నిబంధనలకు నీళ్లు వదిలేస్తున్నారు. ఎటువంటి సేఫ్టీ పరికరాలు లేకుండా షాపూర్ నగర్ ఉషోదయ టవర్ చౌరస్తాలో విద్యుత్ పోల్ ఎక్కిన ఇద్దరు కార్మికులు ఇలా పని చేస్తూ కనిపించారు. ప్రమాదం జరిగిన సమయంలో హడావిడి చేసే అధికారులు సేఫ్టీ పరికరాలు లేకుండా కార్మికులతో ఇలా పనులు చేయించడం పై విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు తీరు మార్చుకోవాలని సూచిస్తున్నారు.

గ్యాస్ లీకై మహిళకు తీవ్ర గాయాలు


మంటలార్పుతున్న స్థానికులు

జగద్గిరిగుట్ట: గ్యాస్ లీకవడంతో మహిళకు తీవ్ర గాయాలైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. పాపి రెడ్డి నగర్ రోడ్డు నంబర్ 12లోని ఓ ఇంటిలో సోమవారం వంట చేస్తుండగా గ్యాస్‌లీకై ఒక్కసారిగా మంటలు రావడంతో వంట చేస్తున్న సువర్ణ(65) అనే మహిళ తీవ్రంగా గాయపడింది. అప్రమత్తమైన స్థానికులు సిలిండర్‌ను వెంటనే ఇంటి బయటకు వేసి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. పోలీసులకు సమాచారం అందించి గాయపడ్డ మహిళను ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ


డీసీ మల్లారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నేత జేమ్స్ తదితరులు

కుత్బుల్లాపూర్ : జంట సర్కిల్ పరిధిలో నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 12 ఫిర్యాదులు వచ్చాయి. కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహ అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో మొత్తం 7 ఫిర్యాదులు రాగా 4 ఇంజినీరింగ్ 2 టౌన్ ప్లానింగ్, శానిటేషన్ ఒకటి ఫిర్యాదులు వచ్చాయి. అదేవిధంగా గాజులరామారం సర్కిల్ పరిధిలో 5 ఫిర్యాదులు, 4 టౌన్ ప్లానింగ్, మరొకటి హెల్త్ అండ్ శానిటేషన్ పై వచ్చాయి. వీటిని సంబంధిత అధికారులకు పంపి సమస్యను వారం రోజుల్లో పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని ఉప కమిషనర్లు తెలిపారు.

కబ్జాపై ఫిర్యాదు

మెట్‌కాని గూడా ప్రాంతంలో గ్రేవీ యార్డు, పార్కు స్థలం కబ్జాకు గురైందని దళిత సంఘాల హక్కుల నేత అవిజే జేమ్స్ ఆధ్వర్యంలో పలువురు ఉప కమిషనర్ మల్లారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆయన స్పందించి సంబంధిత అధికారులు వెంటనే అక్రమ నిర్మాణాన్ని కట్టడి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ప్రజావాణికి స్పందన కరువు

చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో కేవలం రెండు ఫిర్యాదులు వచ్చాయి. రోడ్డుపై ఉన్న గోదావరి పైపులైన్‌కు నీటి లీకేజీ ఏర్పడిందని ఉషోదయ సెక్షన్ సుభాష్ చంద్రబోస్‌నగర్‌కు చెందిన ఆంజనేయులు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా కాలనీలో లో ప్రెషర్ కారణంగా నీటి సమస్య అధికంగా ఉందని గాజులరామారం సెక్షన్ ప్రాగా టూల్స్ కాలనీకి చెందిన గాంధీ ఫిర్యాదు చేశారు. దీనిపై జీఎం అశోక్ సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ల్యూసిడా రైటింగ్ ఉచిత శిక్షణ ప్రారంభం


శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

జగద్గిరిగుట్ట: జితేందర్ హ్యాండ్‌రైటింగ్ అకాడమి ఆధ్వర్యంలో ల్యూసిడా రైటింగ్ ఉచిత శిక్షణను సోమవారం ప్రారంభించారు. రైటింగ్‌లో ఎంతో ప్రావీణ్యం ఉన్న క్యాలిగ్రఫీ, హ్యాండ్ ట్రైనర్ వంపు మల్లయ్య మగ్దూం నగర్ మండల పరిషత్ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు శిక్షణ మొదలు పెట్టాడు. శిక్షణ వారం రోజుల పాటు కొనసాగుతుందని, పరీక్షలు దృష్టిలో పెట్టుకొని 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు మల్లయ్య తెలిపారు.

జిల్లా స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్


కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

కూకట్‌పల్లి: తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ ఎస్సీఆర్టీ సౌజన్యంతో ఫోరం ఫర్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో సోమవారం 10వ తరగతి విద్యార్థులకు జిల్లా స్థాయి ఫిజికల్ సైన్స్ ఆన్‌లైన్ టాలెంట్ టెస్ట్‌ను కూకట్‌పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్వహించారు. జడ్పీహెచ్ఎస్ బాచుపల్లి విద్యార్థి కె విజయ్‌కు మొదటి స్థానం, జడ్పీహెచ్ఎస్ జీడిమెట్ల విద్యార్థి శరణ్యకు ద్వితీయస్థానం, భౌరంపేట్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి సాయి సంతోష్‌కి తృతీయస్థానం, బోడుప్పల్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి అక్షయ్‌కుమార్‌కు కన్సోలేషన్ బహుమతి అందజేశారు. మొదటి మూడు స్థానాల విద్యార్థులు 12వ తేదీన రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఎకాడమీ మానిటరింగ్ ఆఫీసర్ రవీందర్ రాజు మాట్లాడుతూ.. ఈ రోజుల్లో సైన్స్‌కు ఎక్కువ ప్రాముఖ్యత ఉందన్నారు. విద్యార్థులు దృష్టి సారించి కొత్త కొత్త విషయాలను కనుగొని మానవ జీవితం సులభతరం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫోరం అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, జనరల్ సెక్రటరీ మధుసూదన్, ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అజయ్ సింగ్, రాష్ట్ర కోశాధికారి శ్రీనివాసచారి, బీసీఈబీ సెక్రటరీ సురేష్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా బాక్స్‌నాలా!


ధ్వంసమైన బాక్స్ నాలా మూతలు

చింతల్: చింతల్ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లో బాక్స్ నాలాపై మూతలు శిథిలావస్థకు చేరి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. భగత్‌సింగ్ నగర్ నుంచి దుర్గనగర్ వరకు ఉన్న బాక్స్ నాలాపై మూతలు విరిగిపడి అందులోనే పడిపోయాయి. దీంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చిన సమయంలో అదే విధంగా వాహనాల వెంట వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు ఈ బాక్స్ నాలాపై ఉన్న మూతలను గమనించక ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. అధికారులు స్పందించి ఈ బాక్స్ నాలా పై శిథిలావస్థకు చేరిన స్లాబ్ మూతలను తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో తమ ఇళ్ల ఎదురుగా వెళ్తున్న బాక్స్‌నాలాపై అక్రమ పార్కింగ్ చేయడంతో మూతలు విరిగిపోతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

విక్రయదారులపై చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్: కోర్టు వివాదంలో ఉన్న స్థలాలను అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బహదూర్‌పల్లి మాజీ సర్పంచ్ సుజాత శ్రీహరి సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. బహదూర్‌పల్లిలోని సాయినాథ్ సొసైటీ సర్వే నంబర్ 227/1 లో 353 ఎకరాల 30 గుంటల విస్తీర్ణంలో కొంతమంది 2009లో వెంచర్ చేశారని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ కోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. స్థానికంగా కాలనీ ప్రెసిడెంట్‌గా చెప్పుకునే ఓ వ్యక్తితో పాటు మరో వ్యక్తి ప్రభుత్వ భూమిలో ఉన్న ప్లాట్లను అమాయకులకు అంటగడుతూ కోట్ల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు వ్యక్తులపై శాఖా పరమైన చర్యలు తీసుకుని అమ్మకాలను నిలిపివేయాలని కోరారు.

అక్రమ ప్రహరీ నిర్మాణం కూల్చివేత


ప్రహరీని కూల్చివేయిస్తున్న తహసీల్దార్

నిజాంపేట్: నిజాంపేట్‌లో సర్వే నంబర్ 233/21లో ప్రహరీ నిర్మాణాన్ని బాచుపల్లి తహసీల్దార్ పూల్‌సింగ్ ఆధ్వర్యంలో సోమవారం కూల్చివేశారు. ఉదయం నిర్మాణ ప్రాంతానికి వెళ్లి నిర్మాణదారుల పత్రాలను పరిశీలించారు. అనంతరం ఇది ప్రభుత్వ స్థలమని, ఇక్కడ నిర్మాణం చేయడానికి వీలు లేదని కూల్చివేయించారు. ఆదివారం పనులు ఆపేందుకు వచ్చిన ఆర్ఐ పట్ల సదరు నిర్మాణదారులు ప్రవర్తించిన తీరుపట్ల తహసీల్దార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారి వచ్చి పనులు ఆపమంటే ఎందుకు ఆపలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఘనంగా వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ గ్రామంలోని వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 10 గంటలకు ఉత్సవ ఆరంభ స్నపనం, సాయంత్రం 6.30 గంటలకు విష్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, అంకురారోపణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన జాతర ఈ నెల 14న జరుగనుందని ఆలయ చైర్మన్ ఠాకూర్ రాజేందర్ సింగ్ తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వివేకానంద్, చైర్మన్ శ్రీశైలంయాదవ్

• ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: మౌలిక సదుపాయాలను కల్పిస్తూ మెరుగైన పాలన అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం కొంపల్లి మున్సిపల్ పరిధి చంద్రా విల్లాస్, సిల్వర్ లీఫ్, అపర్ణా పామ్స్ గ్రోవ్స్, రాయల్ పార్క్ 2, వడ్డెర బస్తీ ప్రాంతాల్లో రూ.1.2 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొంపల్లి మున్సిపల్ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. పనులు పూర్తయితే పారిశుధ్య వ్యవస్థ మెరుగుపడనుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు దేవేందర్ యాదవ్, రవీందర్ యాదవ్, వినోద్, ప్రవీణ్ రావు, దప్పు కిరణ్, లక్ష్మణ్, సంగీతారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ లెక్కింపులో ఆలయ సిబ్బంది, అధికారులు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట కొండపై ఉన్న లక్ష్మీ వేంకటేశ్వరస్వామి 54వ బ్రహ్మోత్సవాలు ఇటీవలే ముగిశాయి. సోమవారం బ్రహ్మోత్సవాలలో వచ్చిన ఆదాయాన్ని ఈఓ కృష్ణమాచార్యులు, కమిటీ సభ్యుల సమక్షంలో లెక్కించారు. హుండీ ద్వారా రూ.2,39,528, తైబజారు ద్వారా రూ.3,48,400, కట్నాల రూపంతో రూ.1,57,401, ఇతరత్రా రూ.2,57,500 ద్వారా మొత్తం రూ.10,02,829 ఆదాయం వచ్చింది. బ్రహ్మోత్సవాలకు సుమారు రూ.6,61,671 ఖర్చు చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నరేందర్ రెడ్డి, బుచ్చిరెడ్డి, వేణు గౌడ్, రవీందర్, సునీత, రాజు, సుధాకర్ రావు, శశి, శ్రీనివాస్, మల్లికార్జున్ రెడ్డి, సంజీవ్ రెడ్డి, చంద్రమోహన్, దేవాదాయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామస్తులు ఐక్యంగా ఉండండి..


పోతరాజు విన్యాసం


రంగంలో భవిష్యవాణిని వినిపిస్తున్న రాజేష్

సుభాష్‌నగర్: 'గ్రామస్తులంతా ఐక్యంగా ఉండి ఆలయాన్ని కాపాడండి, నేను మిమ్మల్ని కాపాడుతా, ఆలయానికి వ్యతిరేకంగా ఉన్న శక్తులను నా కాలితో నలిపేస్తా.. ప్రతి సంవత్సరం ఇదే విధంగా జాతరను నడిపించండి గ్రామాన్ని నేను కాపాడుత' అంటూ సూరారంలోని కట్ట మైసమ్మ, రేణుకా ఎల్లమ్మ జాతరలో భాగంగా సోమవారం రంగం కార్యక్రమంలో రాజీవ్ గాంధీనగర్ చెందిన రాజేష్ భవిష్యవాణిని వినిపించారు. భవిష్యవాణి వినడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి సమర్పించిన చీరల వేలంపాట వేశారు. సాయంత్రం సూరారం గ్రామం నుంచి ఆలయం వరకు పోతరాజుల విన్యాసాల మధ్య ఫలహారం బండి ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది.

కన్జర్వేషన్ జోన్ మార్పు కోసం ఉద్యమిస్తాం

• బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

దుండిగల్: హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లో ఉన్న కన్జర్వేషన్ జోన్ రైతులకు శాపంగా మారిందని, జోన్ మార్పిడి కోసం బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్. మల్లారెడ్డి అన్నారు. సోమవారం గండిమైసమ్మలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల సమగ్రాభివృద్ధి కోసం 7257 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో 2013లో హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారన్నారు. ఇందులో హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో 70 మండలాలు, 24 మున్సిపాలిటీలు, 8 మున్సిపల్ కార్పొరేషన్‌లతో 750 గ్రామాలు ఉన్నాయన్నారు, మాస్టర్ ప్లాన్‌తో అభివృద్ధి ఏమో గాని రైతులకు శాపంగా మారిందన్నారు. రైతులు సొంత ఇల్లు నిర్మించుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాస్టర్ ప్లాన్‌ను సమీక్షించి రైతులకు అనుకూలంగా జోన్లు మార్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ దుండిగల్ మున్సిపల్ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్వర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.